కలాంకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారతరత్న డాక్టర్ జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతోత్సవాలను పురస్కరించుకుని అనంతపురం నగరం టవర్ క్లాక్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహ్మద్ వాసిమ్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ నాయకులు, మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని అబుల్ కలాం సేవలను కొనియాడారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలోనూ జయంతి సభను నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ పిల్లలకు అవార్డులను అందజేశారు. జిల్లాలో మైనార్టీలకు ప్రభుత్వం నుంచి అందించే అన్ని సంక్షేమ పథకాలు, ఉర్దూ స్కూల్స్, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ అధికారి రామ సుబ్బారెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, వివిధ మైనార్టీ సంఘ సంస్థల నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

భారత దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు, ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుందామని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డివి.రమణమూర్తి, ఇలియాస్ బాషా (ఏఆర్) సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, హరినాథ్, వెంకటేష్ నాయక్, ఆర్ఐ రెడ్డెప్పరెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం ఏవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జెఎన్‌టియులో..

అనంతపురం జెఎన్‌టియులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పరిపాలన భవనంలో నిర్వహించారు. ఆజాద్ చిత్ర పటానికి వీసీ ఓఎస్‌డి ఆచార్య ఎన్. దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కారక్రమంలో బి.దుర్గా ప్రసాద్, పద్మ సువర్ణ, పి.సుజాత, జి.ప్రశాంతి, సత్యనారాయణ, రాజశేఖర్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు.. హెచ్‌ఎల్‌సికి..
పెంచారు తగ్గించారు



◆ ఆధునీకరణకు నిధులు లేనట్టే

◆ ఉమ్మడి జిల్లాకు నిధులు నామమాత్రమే

◆ కూటమి తొలి బడ్జెట్‌పై జనం పెదవివిరుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో హంద్రీనీవాకు నిధులు పెంచారు... తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తగ్గించారు. ఆర్థికమంత్రిగా ఉన్న ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తొలిసారిగా ఆర్థిక బడ్జెట్‌ను శాశన సభలో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో అనంతపురం జిల్లాకు అధిక ప్రాధాన్యతనిస్తారని ఉమ్మడి అనంతపురం జిల్లావాసులు ఎదురు చూశారు. కాని ఆశించినంత నిధుల కేటాయింపులు పెంచలేదు. హంద్రీనీవాకు గతం కంటే కొంత ఎక్కువగా నిధులు కేటాయించారు.

హంద్రీనీవాకు నిధులు పెంపుదల

హంద్రీనీవా ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో రూ.2014.23 కోట్లు కేటాయించారు. అంతకు మునుపు ఈ ప్రాజెక్టుకు కేటాయించినది రూ.486.37 కోట్లు మాత్రమే. ఇందులో పనులకు కూడా నిధుల కేటాయింపులు చేసి ఉండటంతో కొంత వరకు పెండింగ్ పనులు ప్రారంభమయ్యేందుకు అవకాశముంది. హంద్రీనీవాకు సంబంధించి అంతకు మునుపు వైసిపి ప్రభుత్వ హయంలో పెద్దగా నిధులేమీ కేటాయించలేదు. దీంతో కాలువ వెడల్పుగానీ, ఇతర ప్రధానమైన ఎత్తిపోతల పథకాల పనులు ఆగి ఉన్నాయి. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఈ ప్రభుత్వం కూడా పెద్దగా నిధులను కేటాయించలేదు. ఎగువ ప్రదాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తక్షణం మరమ్మత్తులకు రూ.35 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వమూ ఉత్తర్వులిచ్చింది. అయితే బడ్జట్‌లో కేవలం రూ.26.68 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో ఈ పనులు ముందుకు సాగుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.

ఎస్కేయుకు పెంచారు-జెఎన్‌టియుకి తగ్గించారు..!

విద్యా శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు పెంచారు. అనంతపురం జెఎన్‌టియుకు నిధుల కేటాయింపులు తగ్గించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి 2023-24 బడ్జెట్‌లో రూ.83.26 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.100.13 కోట్లు కేటాయించారు. జెఎన్‌టియుకు ఆ ఏడాది రూ65.55 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.58.97 కోట్లే కేటాయించారు.

హామీల అమలుపై స్పష్టత లేదు..

కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే. జిల్లా సాగునీటి వనరుల అభివద్ధి కోసం ఏడు వేల కోట్లు కేటాయించే విషయంలో స్పష్టత లేదు. దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న వేతన పెంపు హామీల గురించి ప్రస్తావించలేదు. సంక్షేమ పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం గురించి ఘనంగా చెప్పిన ఆర్థిక మంత్రి మహిళకు ఉచిత బస్ ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని చెప్పారేతప్ప, సుపర్-6లో భాగమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా తరగతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. పంటల బీమా స్వచ్ఛంద నమోదు అన్న ఆకర్షణీయ మాటల వెనుక ఇప్పటివరకున్న ఉచిత బీమా ఇకపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అమలవుతుందన్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదాతను మభ్యపుచ్చడమే అవుతుంది. మెగా డీఎస్సీపైనా బడ్జెట్‌లో స్పష్టత లేదు. బడ్జెట్‌లో చార్జీల తగ్గింపు గురించి ప్రస్తావనే చేయకపోవడం విడ్డూరం.

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు.

సూపర్ ఛీటింగ్

చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అని చెప్పి ఎన్నికల తరువాత సూపర్ మోసం చేస్తున్నారు. వారిచ్చిన హామీలకు తగ్గట్టు బడ్జెట్ కేటాయింపుల్లేవు. రాష్ట్రంలో 51 లక్షల మందికిపైగా అన్నదాతలులున్నారు. వారందరికీ ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వాలంటే రూ.10 వేల కోట్లు అవసరమవుతాయి. అయితే బడ్జెట్‌లో రూ4400 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం పథకానికి రూ.13 వేల కోట్లు నిధులు అవసరమవతాయి. కాని రూ.4500 కోట్లు కేటాయించారు. ఇక నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. మహిళాశక్తికి కేటాయింపుల్లేవు. సాగునీటికి కేటాయింపులు నామమాత్రంగానే జరిగాయి. ఈ బడ్జెట్ ప్రజలను మోసం చేసే బడ్జెట్‌లాగానే ఉంది.

అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు.

హామీలకు తగ్గట్టు బడ్జెట్ లేదు..

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు ప్రస్తావన బడ్జెట్‌లో కనిపించలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ అంశం లేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావనలేదు. ఇలా ఇచ్చిన హామీల అమలుకు తగ్గట్టు బడ్జెట్ కేటాయింపుల్లేవు. జిల్లాలోని సాగునీటికి కేటాయింపులు నామమాత్రంగానే జరిగాయి.

జాఫర్ సిపిఐ జిల్లా కార్యదర్శి.

'ది గుత్తి బ్యాంకు' మరింత అభివృద్ధి చెందాలి

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ది గుత్తి కోఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మరింత అభివద్ధి చెందాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. సోమవారం అనంతపురం నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్లో ఎస్‌జె టవర్స్ మొదటి అంతస్తులో ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ 4వ శాఖని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా పేదలకు మంచి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమిరిటీస్ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ జిలాని, డిసిఓ అరుణకుమారి, న్యాఫ్కబ్ డైరెక్టర్ సిహెచ్.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల నిర్వహణలో గందరగోళం

బినామీలపై గ్రామస్తుల ఫిర్యాదు

రేషన్‌షాపుల నిర్వహణలో బినామీలు వద్దంటూ వినతిపత్రం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-యల్లనూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి చౌక ధాన్యపు డిపోల నిర్వహణ బాధ్యతలు మారాయి. గతంలో ఉన్న పద్ధతిని కాకుండా కొత్త వ్యక్తులు డీలర్‌షిప్‌ను తీసుకుని రేషన్ సరుకులను అందిస్తున్నారు. ఇందులో భాగంగా యల్లనూరు మండలంలో 34 చౌక ధాన్యపు దుకాణాలు ఉండగా ఇందులో 21 పర్మినెంట్ దుకాణాలు మినహా మిగిలిన 13 దుకాణాల్లో 7 దుకాణాలకు డీలర్లు మారారు. సమస్యలు లేని గ్రామాల్లో ఇదివరకే డీలర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టని గ్రామాల్లో రేషన్ పంపిణీలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. మండల పరిధిలోని పెద్దమల్లేపల్లి గ్రామం ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణం నెం:5ను అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మోహన్ నాయుడుకు కేటాయించారు. ఈ గ్రామంలో ఈ వ్యక్తి పేరుతో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి చంద్రశేఖర్ నాయుడు రేషన్ షాపును నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే గ్రామస్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. బినామీల పేరుతో రేషన్‌షాపులను నిర్వహిస్తున్న వారిని తొలగించాలంటూ గ్రామస్తులు ప్రజా వేదికలో వినతి పత్రం అందించారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. అధికారులు స్పందించి రేషన్ షాపులు ఒక పద్ధతి ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

104 సర్వీస్‌లను ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

104 సర్వీస్‌లను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్ విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులుగా 16 సంవత్సరాలుగా తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. 151 జిఓ ద్వారా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 104 ఉద్యోగులను 2020 జులై 1 నుంచి అరబిందో ఫార్మా ఫౌండేషన్ అనే సర్వీస్ ప్రొవైడర్‌కి ఇచ్చి ఉద్యోగులను ప్రయివేట్‌కి అప్పగించారు. ఆప్కాస్‌లో చేర్చుతామని హామి గత ప్రభుత్వం విస్మరించింది. వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. బకాయి వేతనాలు చెల్లించేలా అరబిందో ఫార్మా యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామస్తులు అడ్డుచెప్పినా ఆగని ఇసుక తరలింపు..!

అధికారుల మౌనంపై ఆగ్రహం

ప్రజాశక్తి-యల్లనూరు

గత రెండు రోజుల నుంచి మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి నదిలో చిలమకూరు ఇసుక రీచ్‌కు అనుమతి ఉందంటూ కాంట్రార్లు ఇసుక తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లు తిరిగేందుకు వీలుగా ఆ ప్రాంతంలో రోడ్డును సైతం ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా ఇసుక రవాణా సాగుతోంది. గత నెలలో చిలమకూరు గ్రామ సమీపంలో ప్రభుత్వ ఇసుక రీచ్‌కు సన్నాహాలు చేయగా ఆ గ్రామస్తులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. ఇసుక తరలింపు ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉందంటూ గ్రామస్తులు జాయింట్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఇదిలా ఉండగానే ఇసుక తరలింపునకు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులివ్వకుండానే రీచ్ నుంచి ఇసుక తరలించేందుకు రోడ్డు వేయడంపై గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించేందుకు కొందరు రోడ్డు వేస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక తరలించేందుకు వీల్లేదంటూ రీచ్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీరామప్రసాద్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని గుత్తేదారులతో మాట్లాడారు. ఇసుక తరలించేందుకు అనుమతులు లేనందను తరలింపును నిలిపేయాలని గుత్తేదారులకు తెలిపి అక్కడున్న టిప్పర్లు, ఇటాచీలను వెనక్కు పంపించారు.

చిత్రావతి నది వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఇసుక రీచ్ వద్దే వద్దు

తమ గ్రామంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయొద్దంటూ తిరుమాలాపురం గ్రామస్తులు స్పష్టంగా చెబుతున్నారు. మూడు రోజుల నుంచి అనుమతి లేకుండా నదిలో ఇసుక తరలించే ప్రక్రియ సాగుతుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను తరలించడం ద్వారా బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయని, ఇప్పుడు అదే పని చేస్తే ఉన్న కొద్ది పాటి నీటి వనరును కూడా కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను తరిలిస్తే అడ్డుకుంటామని తెలియజేశారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో భాగంగా వివిధ సమస్యలపై 427 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా తమ భూములను దౌర్జన్యంగా లాక్కున్న వారి నుంచి రక్షణ కల్పించి తమ భూములను తిరిగి తమకు ఇప్పించాలని బంజారా గిరిజన మహిళల ఫిర్యాదు చేశారు. కురుగుంట గ్రామానికి చెందిన సావిత్రిబాయి, నాగమణి బాయి, బాబీ బాయిలు కురుగుంట గ్రామ పొలం సర్వే నంబర్ 132-2లో యా. 4.50 సెంట్లు భూమిని 2018 సంవత్సరంలో సుగాలి గిరిజన 85 కుటుంబాలకు ప్రభుత్వం వారు డి ఫామ్ పట్టాలు ఇచ్చింది. పట్టాలు పొందినప్పటి నుండి అదే గ్రామానికి చెందిన మాలపాటి రాము, టెంకాయల ఉత్తన్న, మరికొందరు మాకిచ్చిన పట్టా భూములను వారికి చెందినవంటూ దౌర్జన్యం చేశారు. ఎదిరించలేక హైకోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఈ సమస్య ఉందన్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని బేఖాతరు జెసిబిల సహాయంతో మా ప్లాట్ల లోకి రావడంతో అడ్డుపడగా మేము మహిళలు అనికూడా చూడకుండా మాపై దాడి చేసి గాయపరిచారని మహిళలు వాపోయారు. భూ వ్యవహారం మీద, మాకు జరిగిన దాడి మీద సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ భూ సమస్యపై పరిశీలన చేయాలని రెవెన్యూ అధికారులను జేసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఓ ఎ.మలోల, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

సచివాలయాల్లో కనిపించని వెటర్నరీ అసిస్టెంట్లు

మండల కేంద్రంలో విధులంటూ తప్పించుకుంటున్న వైనం..ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలవ్యాప్తంగా వెటర్నరీ అసిస్టెంట్లు విధులకు డుమ్మా కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 13 సచివాలయాలకు 13 మంది వెటర్నరీ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించింది. వీరందరూ సంబంధిత సచివాలయాల్లో సమయానికి అనుగుణంగా విధులకు హాజరై పశు వైద్యసేవలు అందించాలి. అయితే ఏ ఒక్కరూ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఫలితంగా సచివాలయాల్లోని వెటర్నరీ సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సచివాలయానికి వస్తున్న రైతులు వెటర్నరీ అసిస్టెంట్లకు ఫోన్ చేసి విధులకు రాలేదని అడిగితే తమ డాక్టర్ పుట్లూరు వెటర్నరీ ఆసుపత్రిలో ఉండాలని సమాధానం చెబుతున్నారు. ఆఖరికి ఆయా పంచాయతీ సెక్రటరీలు ఫోన్ చేసినా అదే సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. పోనీ మండల కేంద్రంలోనైనా ఉన్నారా అంటే.. అది కూడా లేదు. ఈ విషయమై వెటర్నరీ డాక్టర్ నాగసువర్ణను ఫోన్ ద్వారా వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెటర్నరీ అసిస్టెంట్లు సచివాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాళం వేసిన పుట్లూరులోని పశువైద్యశాల, (ఇన్‌సెట్‌లో) సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజలపై భారాలు వేస్తే పతనమే...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఎం నాయకుల హెచ్చరిక-కొనసాగిన ప్రజాపోరు

అనంతపురం ప్రజాపోరులో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తూ వెళ్తే.. రానున్న రోజుల్లో పతనం తప్పదని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ముర్తుజా హెచ్చరించారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరులో భాగంగా సోమవారం అనంతపురం న్యూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని రుద్రంపేట నుంచి రామ్‌నగర్ సర్కిల్ వరకూ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు మూడు పర్యాయాలుగా ఇస్తున్న హామీల్లో ఏ ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ముఖ్యంగా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని తీసుకొస్తామని, ప్రభుత్వ రంగసంస్థలు, ఆస్తులను కాపాడుతామని, ధరలను అదుపు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఇక మోదీని నమ్ముకున్న రాష్ట్ర సిఎం చంద్రబాబు ఎప్పటిలాగే ముప్పు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. రోజురోజుకూ నిత్యావసర ధరలు, పెట్రో, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీలాంటి కంపెనీలకు లాభాలు ఇచ్చి, ప్రజలపైన భారాలు వేస్తోందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర న్యూ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు ఇర్ఫాన్, గోపాల్, ఎటిఎం నాగరాజు, కమిటీ సభ్యులు ఆదినారాయణ, లతీఫ్ గౌస్, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, ఆదినారాయణ, గఫూర్, లింగారెడ్డి, ప్రజాశక్తి నగర్ కాలనీ కార్యదర్శి శ్రీనివాసులు, వార్డు మెంబర్ ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం 1వ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని నీలిమ సర్కిల్ నుంచి ద్వారకానగర్, ఆర్‌కె.నగర్, శాంతినగర్ సర్కిల్, సునీతనగర్, 4వ రోడ్డు కూడలి మీదుగా ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకటనారాయణ, వలి, ప్రకాష్, నగర కమిటీ సభ్యులు గఫూర్, వెంకటేష్, జీవా, శాఖా కార్యదర్శి ఫక్రూ, మహేష్, మల్లు స్వరాజ్యం కాలనీ నాయకులు రాజు, రఫీ, షరీఫా, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరులో భాగంగా రాప్తాడు మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మన్నీలా ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅఫ్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, ఉచిత ఇసుకను అమలు చేయాలని, మద్యం-మహిళలపై దాడులను అరికట్టాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలిని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 14న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, నారాయణస్వామి, వన్నూరుస్వామి, మల్లేశ, వెంకటరాముడు, వంశీ, సుబ్బరాయ, అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం సోమవారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని ఏకలనాగేపల్లి నుంచి ఇల్లూరు వరకూ బిటి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఆగే కల్లుమడి శ్మశాన వాటికల్లో కంపచెట్లు తొలగించాలని, కల్లుమడి-గుమ్మేపల్లి దారిలో కంపచెట్లు తొలగించాలని, కల్లుమడి-శింగనమల రోడ్డు మరమ్మతులు చేయాలని, వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జయరాముడు, సుధీర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయిస్వామి, మునెప్ప, కేసన్న, నారాయణ, కేసన్న, వెంకటరాముడు, చంద్ర, నాగరాజు, సుంకన్న, శ్రీనివాసులు, కొండారెడ్డి, సూర్యప్రకాష్, వెంకటస్వామి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన కూటమి ప్రభుత్వంపై పోరాటం చేసేందుకే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, ఎం.మల్లేష్, యు.మల్లికార్జున తెలిపారు. సోమవారం పట్టణంలోని దాసరి కాలనీలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సి.రమేష్, ధను, బాలాజీ, నవీన్‌యాదవ్, కవిత, శ్యామల, మారి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

తాడిపత్రి : విద్యుత్ ఛార్జీల పెంపు, ట్రూఅఫ్ ఛార్జీల వసూలు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని విద్యుత్ శాఖ ఎడి కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎలాంటి విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.6,400 కోట్లు ప్రజలపై భారం వేసేందుకు పూనుకుందన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్, రాజారాం, నరసింహ, రామ్మోహన్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు సిపిఎంనాయకుడు జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రైతుసంఘం కార్యదర్శి తురకపల్లి దేవేందర్‌రెడ్డి, చెర్లోపల్లి శ్రీనివాసరెడ్డి, పెద్దపప్పూరు కొండయ్య, అమ్మలదిన్నె కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కూటమి ప్రభుత్వం తొలిసారి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై పార్టీలు, ప్రజాసంఘాల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. అధికార టిడిపి నాయకులు రాష్ట్రాభివృద్ధికి దోహదపడే బడ్జెట్ అని చెబుతుండగా, ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రజలను మోసం చేసే బడ్జెట్ అంటూ విమర్శలు చేస్తున్నారు.

రైతు, పేదల సంక్షేమ బడ్జెట్ : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు : అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రైతు, పేదల సంక్షేమ బడ్జెట్ అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలందరూ మెచ్చుకునేలా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెట్టేస్తే కూటమి ప్రభుత్వం తిరిగి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఇప్పటికే రూ.4,500 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేశామన్నారు.

రైతాంగాన్ని నిరాశపరిచిన బడ్జెట్

ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు తీవ్ర నిరాశ కలిగించింది. ఎన్నికలలో సూపర్ సిక్స్ హామీల్లో రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రూ.14 వేలు మాత్రమే ప్రకటించడం దుర్మార్గం. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో పంటలు పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతుల అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి. అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్ చేస్తామని చెప్పడం తప్ప బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయింపు చేయలేదు. విత్తనాల సబ్సిడీకి తక్కువ మొత్తంలో నిధులు కేటాయించడం సాగునీటి ప్రాజెక్టులు హెచ్‌ఎల్‌సి లైనింగ్ పూర్తి చేసేందుకు, హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడం జిల్లా రైతాంగాన్ని మోసం చేయడమే.

విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలి

వి.కోటేశ్వరప్ప, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

అనంతపురం కలెక్టరేట్ : విద్యా రంగానికి 9.8 శాతం మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్‌లతో పోల్చితే చాలా తక్కువగా నిధులు ఉన్నాయి. ఈ నిధులు ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఏమాత్రం చాలదు. గత ప్రభుత్వం పాఠశాల విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. దానిని పునర్నించే పనిని ఈ ప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశ పరిచింది. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి 30 శాతం నిధులు తమ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని చెప్పిన కోఠారి కమిషన్ సిఫార్సుల దరిదాపుల్లో కూడా ఈ బడ్జెట్ కేటాయింపులు రాకపోవడం శోచనీయం. నాడు-నేడు పనులు నిధులు లేక సగంలో నిలిచిపోవడంతో నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయి. వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం నిధుల కేటాయింపు ఈ బడ్జెట్‌లో లేవు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, 12వ పిఆర్‌సి అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం శోచనీయం.

రాష్ట్ర బడ్జెట్‌తో స్వర్ణాంధ్ర సాకారం : పోతుల

అనంతపురం : బడ్జెట్‌లో వ్యవసాయం, ఆరోగ్యం, కులవృత్తులకు ప్రాధాన్యం కల్పించి సిఎం చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వర్ణాంధ్రకు సాకారం చేశారు. పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ ప్రయోజనం కలిగే బడ్జెట్‌ను ప్రకటించడం గమనార్హం అన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. మహిళలకు అతిత్వరలో ఉచిత బస్సు పథకం, వ్యవసాయం, ఆరోగ్యం, చేనేత, కులవృత్తులకు బడ్జెట్‌లో పెద్దపీట వేసిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై పూర్తిగా దృష్టి సారించిందన్నారు. బడ్జెట్‌పై మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు.

పెద్దపప్పూరు ఎస్ఐగా నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల నూతన ఎస్ఐగా నాగేంద్రప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గౌస్‌బాషా బదిలీపై వెళ్లగా అతని స్థానంలో పుట్టపర్తి నుంచి నాగేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉరవకొండ ఎస్ఐగా జనార్ధన్‌నాయుడు

ఉరవకొండ : ఉరవకొండ ఎస్సైగా జనార్ధన్‌నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు రామగిరి నుంచి అమలాపురం వెళ్లారు. ప్రస్తుతం అక్కడి నుంచి ఉరవకొండకు బదిలీపై వచ్చారు. దీంతో స్టేషన్ సిబ్బందితోపాటు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర కన్వీనింగ్ కమిటీలో ఇద్దరికి చోటు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర కన్వినింగ్ కమిటీలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, పర్మినెంట్ చేయాలనే తదితర సమస్యల పరిష్కారం కోసం విజయవాడ మాకినేని బసవపున్నయ్య కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రవ్యాప్త విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల కన్వినింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సంజీవరాయుడు, తాడిపత్రి మున్సిపాలిటీ నుంచి జుబేర్‌కు చోటు కల్పించారు. అనంతరం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈనెల 20న మున్సిపల్ కమిషనర్లు, ఛైర్మన్, మేయర్లకు వినతిపత్రాలు ఇవ్వడం, నెలాఖరులో ఇంజినీరింగ్ కార్మికుల జిల్లా సదస్సు, మంత్రులకు వినతిపత్రాలు, డిసెంబర్ 2, 3వ తేదీల్లో మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చినట్లు వివరించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే విధుల నుంచి తప్పించాలి

ప్రజాశక్తి-నార్పల

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే విధుల నుంచి తమను తప్పించాలని గ్రామ రెవెన్యూ అధికారులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ అరుణకుమారికి మండలంలోని విఆర్‌ఒలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తాము గ్రామస్థాయిలో జరగనున్న నీటి సంఘం ఎన్నికల ఓటరు లిస్టు తయారీ, రీసర్వేలు, రెవెన్యూ గ్రామసభలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, సాధారణ ఎన్నకల ఓటరు నమోదపై ఇంటింటికీ వెళ్లే విధులు నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు ప్రతినెలా 1వతేదీన ఉదయం 5గంటలకే గ్రామాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సెలవు రోజులు అయిన 2వ శనివారం, ఆదివారాల్లో కూడా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే రెగ్యులర్ విధులైన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఎఫ్‌ఎంసీలు, కోర్టు వాయిదాలు, నీటి తీరువా డిమాండ్ తయారు చేయుట, తదితర పనులతోపాటు రైస్‌మిల్లుల వద్ద కస్టోడియన్ ఆఫీసర్లుగా, కొన్ని ప్రాంతాల్లో ఇసుక రీచ్‌ల వద్ద రాత్రింబవళ్లు విధులు చేస్తూనే ఉన్నామన్నారు. వీటితోపాటు అనేక విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా పనిభారం ఎక్కువ అవుతోందన్నారు. కావున తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే విధుల నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్వోలు శివరామ్, పెద్దన్న, వెంకోబారావు. వంశీకృష్ణారెడ్డి, కొండయ్య, రామాంజనేయులు, నిరంజన్‌రావు, సుకన్య, ప్రభావతి, గాయత్రీ, చంద్ర, మౌనిక, కీర్తి, తదితరులు పాల్గొన్నారు..

తహశీల్దార్లకు విఆర్‌ఒల వినతి

నార్పలలో తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

పెద్దవడుగూరు : స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే విధుల నుంచి తమను తప్పించాలని రెవెన్యూ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఉషరాణిని కలిసి విఆర్‌ఒలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు రమేష్‌రెడ్డి, చింతల ఆంజనేయులు, రామకృష్ణ, సుంకన్న, రాజేష్, అనిల్, సోము, రమేష్, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు : గ్రామ రెవెన్యూ అధికారులకు ఇతర శాఖలకు సంబంధించిన పనులు కేటాయించడం ద్వారా అధిక ఒత్తిడికి గురవుతున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారులు వాపోయారు. స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే విధుల నుంచి తప్పించాలని కోరుతూ సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పవన్‌కుమార్, రుద్రప్ప, పర్వీన్, శ్రీరాములు, నాగిరెడ్డి, తమర శేఖర్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు, కణేకల్లు మండలాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తున్న విఆర్‌ఒలు

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు స్వల్పం

ప్రజాశక్తి-రాయదుర్గం

అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు స్వల్పంగా కేటాయించారని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా కార్యదర్శులు రవికుమార్, హనుమంతురెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, రాయదుర్గం, గుమ్మగట్ట మండల శాఖల ప్రతినిధులు రామాంజనేయులు, నాగరాజు, శ్రీనివాసులు, మురళి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈసారి వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి 9.8 శాతం కేటాయించారన్నారు. ఇది గత బడ్జెట్‌తో పోల్చితే తక్కువ అన్నారు. ఇది విద్యారంగ అభివృద్ధికి ఏమాత్రం సరిపోదన్నారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పునర్ నిర్మించే పని చేస్తోందన్నారు. నాడు-నేడు పనులు అర్ధాంతంగా నిధులు లేక నిలిచిపోయి నూతనంగా నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, 12వ పిఆర్‌సికి సంబంధించిన అంశాలు బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఆర్థిక బకాయిల చెల్లింపులు, 12వ పిఆర్సి అమలుకు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు.

టమోటా రైతులకు బీమా సౌకర్యం

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలో రబీలో సీజన్‌లో సాగు చేసిన టమోటా రైతులకు వాతావరణ బీమా సౌకర్యం కల్పించనున్నట్లు కళ్యాణదుర్గం ఉద్యానవన శాఖ అధికారి కృష్ణతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టమాటా పంట సాగు చేసే రైతులు ఈక్రాప్ నమోదుతోపాటు ఎకరాకు రూ.1,600 చొప్పున డిసెంబర్ 15వతేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో పంట నష్టపోతే ఎకరాకు రూ.32వేల బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు అగ్రికల్చర్ బీమీ కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణసాగర్ ఫోన్ 99122 75799ను సంప్రదించాలని కోరారు.

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం డివిజన్ పరిధిలోని రబీ సీజన్‌లో టమోటా పంట ఆసగు చేసిన రైతులకు వాతావరణ బీమా సౌకర్యం కల్పించనున్నట్లు రాయదుర్గం ఉద్యానశాఖ అధికారిణి మౌనిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదుతోపాటు ఎకరాకు రూ.1,600 చొప్పున డిసెంబర్ 15వతేదీలోపు చెల్లిస్తే పంట నష్టపోతే ఎకరాకు రూ.32వేల బీమా వర్తించనున్నట్లు తెలిపారు.

స్కేటింగ్‌లో అనంత బాలుడు సత్తా

ప్రజాశక్తి-అనంతపురం

36వ ఇంటర్ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం బాలుడు హంజా హుస్సేన్ రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న 36వ ఇంటర్ జిల్లాల రోలర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన స్కేటింగ్ క్రీడాకారులు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఈ పోటీల్లో 7 నుండి 9ఏళ్ల విభాగంలో అనంతపురానికి చెందిన హంజా హుస్సేన్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. రోలర్ స్కేటింగ్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్, రోడ్ రేస్ విభాగంలో ఒక సిల్వర్ మెడల్ సాధించి జిల్లా పేరును మారుమోగించాడన్నారు. ఉత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించిన హంజా హుస్సేన్‌ను శిక్షకులు నాగేంద్ర, హేమంత్, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిబాల అభినందించారు.

ప్రతిభ కనబరిచిన హంజాహుస్సేన్

వాహనాల తనిఖీ

వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం మలుపు వద్ద ఎస్ఐ శ్రీరామప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వాహనాలకు సంబంధిత రికార్డులను పరిశీలించారు. అలాగే కారు డ్రైవర్లు సీట్‌బెల్టులు పెట్టుకోవాలని సూచించారు. రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో జమేదారు వెంకటేష్, పోలీసులు జనార్ధన్, నాగరాజు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఉపకారాగారం తనిఖీ

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని న్యాయ సేవాసమితి జిల్లా కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్, గుత్తి మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారగారంలోని రికార్డులు, వంటగది, స్టోర్ రూమ్, బ్యారెక్ లు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం అయ్యారు. సబ్‌జైలు ఆవరణలో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలని సబ్ జైలర్ రాధాకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ. సూర్యనారాయణ, వి.నరసింహనాయుడు, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల సమస్యలను తెలుసుకుంటున్న జడ్జి

రక్తదానం చాలా గొప్పది : పాటిల్ అజయ్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పాటిల్‌అజయ్

ఆపద సమయంలో ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం చాలా అవసరమని టిడిపి యువ నాయకుడు పాటిల్‌అజయ్ అన్నారు. పాటిల్ అజయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పివిఆర్ (పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి) పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 200 మంది రక్తదానం చేశారు. తొలుత మాజీ ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రక్తదానం చేసిన వారకి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. పాఠశాల యజమాని (పాటిల్ అజయ్)కి పివిఆర్ స్కూల్ విద్యార్థులు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్‌కుమార్‌రెడ్డి, షమీముల్లా, వీరేష్, షామీర్, సలీం, మంజు, దాదు, రాఖీ, సాయి, మూర్తి, సీనా, పివిఆర్ స్కూల్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

రాయదుర్గం : టిడిపి యువ నాయకుడు పాటిల్ అజయ్ జన్మదినం సందర్భంగా సోమవారం రాయదుర్గంలో 'ఆకలి బంధం' స్వచ్ఛంద సంస్థ యాచకులు, నిరాశ్రయులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులు నాగయ్య, మారేష్, శంకర్, పెన్నయ్య, ఆనంద్ తదితరులు అల్పాహారాన్ని పట్టణంలోని వీధులు, రహదారుల్లో ఉన్న నిరాశ్రయులు, అనాథలు, నిరుపేదలకు అందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్ఆర్ఐటి అధ్యాపకులు

హ్యాకథాన్‌లో 'ఎస్ఆర్ఐటి' విద్యార్థుల ప్రతిభ

శింగనమల : బుక్కరాసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు హాకథాన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారు. కళాశాలలోని సిఎస్ఇ విభాగానికి చెందిన వెంకట రాహుల్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటరాజు, శ్రీకాంత్‌రెడ్డి తాడిపత్రిలోని ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టెకబ్లేజ్ 2కె24లో పాల్గొని మొదటి బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, టిపిఒ ఎం.రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాస్, హెచ్‌ఒడి పి.చిత్రలింగప్ప, ఐఐఐసీ సెల్ కన్వీనర్ జి.హేమంత్‌కుమార్‌యాదవ్ అభినందించారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం..

మాజీ ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది..' అంటూ మాజీ ఎంపీ తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. ప్రమాదవశాత్తు గాయపడిన ఎనుములదొడ్డి గ్రామ పంచాయతీ ఎస్.మల్లాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పెద్ద మల్లప్పను రంగయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు గాయపడిన పెద్దమల్లప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, సర్పంచి తనయుడు విజయకుమార్, మార్కెట్ డైరెక్టర్ లింగప్ప, మాజీ జడ్పిటిసి రాజగోపాల్, మాజీ సర్పంచి తిప్పేస్వామి, నరసింహులు, రుద్రంపల్లి హనుమంతురాయుడు, బొమ్మలింగ, తదితరులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన రవికుమార్

యల్లనూరు : మండల పరిధిలోని లక్షుంపల్లి గ్రామంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రవికుమార్ (35) అనారోగ్యంతో బాధపడేవాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీరామప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జూదరులు అరెస్టు

తాడిపత్రి రూరల్ : పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు రూరల్ పరిధిలోని చుక్కలూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణిబాబు సిబ్బందితో కలిసి దాడి చేసి జూదరులు శవల శివ, సోమశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, షేక్ రహీంబాషా, హనుమంతురెడ్డి, రామనాథరెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.4.45 లక్షల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

హిజ్రాపై దాడి

పామిడి : స్థానిక నాగిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న హిజ్రా చామంతి ఇంటిపై ఆదివారం అర్ధరాత్రి అనంతపురానికి చెందిన హిజ్రాలు మయూరి, ఆసీఫ్ ఆధ్వర్యంలోని ముఠా దాడి చేసింది. బాధిత హిజ్రా చామంతి తెలిపిన వివరాల మేరకు.. నాగిరెడ్డి కాలనీలో తన నివాసంలో తనతోపాటు మరో ఏడుగురు నివాసం ఉన్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో అర్ధరాత్రి అనంతపురానికి చెందిన మయూరి, ఆసీఫ్ హిజ్రాల ఆధ్వర్యంలో సుమారు నాలుగు ఆట్లో హిజ్రాలు వచ్చి ఇంట్లో దూరి గృహ సామాగ్రినంత ధ్వంసం చేశారన్నారు. అంతేగాకుండా బీరువా పగులగొట్టి రూ.15లక్షల నగదు, 350 గ్రాముల బంగారం, వెయ్యి గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారన్నారు. సమాచారం అందుకున్న సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సమీక్షించారు. బాధిత చామంతి ఫిర్యాదు మేరకు అనంతపురం మయూరి, ఆసిఫ్ హిజ్రాల బృందంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిల్లరకొట్టులో చోరీ

గుత్తి : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న చిల్లర కొట్టులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దాసరి కాలనీకి చెందిన లక్ష్మీదేవి ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న బంకులో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహించేది. రోజువారి ప్రకారం ఆమె చిల్లర కొట్టుకు తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లింది.గమనించిన గుర్తుతెలియని దుండగులు బంకు వెనుక వైపు రంధ్రాలు చేసి లోపల ఉన్న రూ.వెయ్యి నగదు, రూ.9వేలు విలువచేసే సిగరెట్ పాకెట్లను దోచుకు వెళ్లారు. బాధితురాలు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

13న జాబ్‌మేళా

ఉరవకొండ : మండలంలోని చిన్నముష్టూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 13న బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అష్రఫ్‌అలీ, ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.వి.ప్రతాపరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో టాటా క్యాపిటల్, నవభారత్ ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా లాంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్..70138 00115ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళంలో ఉన్న 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి మరమ్మతుల కారణంగా తొమ్మిది రోజులపాటు విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ బాలచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రాయదుర్గం, గుమ్మఘట్ట మండల పరిధిలో ఉన్న అన్ని 33/11కెవీ సబ్‌స్టేషన్‌లోని అగ్రికల్చర్ ఫీడర్లు 3ఫేస్ విద్యుత్ ఏడు గంటలు, 1ఫేస్ విద్యుత్ యథావిధిగా 24 గంటలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మార్పును ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి

బెలుగుప్ప : మండలంలోని గంగవరం గ్రామంలో వాల్మీకి పెద్దల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో బాగంగా వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. తర్వాత చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. భారతీయ సంస్కృతి, జీవన విధానానికి మూలమైనటు రామాయణాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ వాల్మీకి పెద్దలు, సోదరులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌టిఒ కార్యాలయాన్ని ప్రారంభించాలని వినతి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలో ఆర్‌టిఒ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నాయకులు కోరారు. ఈమేరకు పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలూకా అధ్యక్షులు చెల్లమప్ప మాట్లాడుతూ నియోజకవర్గానికి మూడేళ్ల క్రితం మంజూరైన ఆర్‌టిఒ కార్యాలయం ఇంత వరకూ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆర్‌టిఒ కార్యాలయాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జెఎసి జిల్లా నాయకులు దొనతిమప్ప, నాయకులు చనమల్లి తిప్పేస్వామి, నాగరాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, స్టోర్ అమర్నాథ్‌రెడ్డి, అరటికాయల సుధాకర్, కుందు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ గిడ్డమ్మ మృతి

గిడ్డమ్మ (పాతచిత్రం)

గుత్తి : టిడిపి సీనియర్ నాయకులు నగదాని జయన్న, నగదాని సత్య, నగదాని నాగేష్ మాతమూర్తి, మున్సిపాలిటీ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ నగదాని గిడ్డమ్మ (74) సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌద తోపాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గిడ్డమ్మ పేదల అభ్యున్నతికి పాటు పడ్డారని కొనియాడారు.

తాడిపత్రిలో అబుల్‌కలాం గురించి వివరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌కు నివాళి

ప్రజాశక్తి-తాడిపత్రి

స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో అబుల్‌కలాం చాలా ముఖ్య పాత్ర పోషించారన్నారు. అంతేగాకుండా దేశంలో మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా విద్య అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ముస్లిలు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్యులు, మతపెద్దలు, తాడిపత్రి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించారు. తర్వాత మదరసాలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తాడిపత్రి తహశీల్దార్ రజాక్, తాడిపత్రి ఎంపిడిఒ, మైనార్టీ డాక్టర్లు, తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్లు, మసీద్ కమిటీ పెద్దలు, మైనార్టీ పెద్దలు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని గుండ్లపదొడ్డి ఉర్దూ పాఠశాలలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పాడ్‌లు, పెన్నులు, కేక్‌లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లపల్లి వీరయ్యచౌదరి, ఫక్రుద్దీన్‌సాబ్, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షుడు బోయ నాగరాజు, మైనారిటీ అధ్యక్షుడు కాంగ్రెస్ దాదా, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఉద్దీప్‌సింహ, ఎస్సీ కాలనీ రవి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్‌ఆర్‌సిపి అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మౌలానా అబుల్ కలాం సేవలు ఎనలేనివని సర్పంచి మల్లెల జగదీష్, ప్రధానోపాధ్యాయులు రాజేష్ కొనియాడారు. అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని సోమవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ పూసల నరేష్, ఉపాధ్యాయులు దేవేంద్ర, మిడ్ డే మీల్స్ నిర్వాహకులు గురుమూర్తి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, జాతీయ సేవా పథక విభాగాల ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు అయిరీబ్ ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ ,రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బాబు, దేవదాసు, రఘు, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కోదండరాములు, నారాయణ, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గుత్తి : భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గుత్తి ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, నాయకులు వెంకటేష్, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి,శామ్యూల్, హసన్ అహ్మద్, చెన్నారెడ్డి, సంపత్, గోవిందప్ప, నారాయణశెట్టి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

గుత్తిలో నివాళులర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ఆరోగ్య రంగానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైద్య ఆరోగ్య రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కొండయ్య, శ్రీనివాస్ రావు తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల సందర్భంగా జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖలను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో న్యూరో సర్జరీ, కార్డియాలజీ మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ అందుబాటులో లేకపోవడంతో సర్జరీ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కర్నూలులో మాదిరిగా కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం, క్యాన్సర్ ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో

ప్రజారోగ్య వేదిక

అప్‌గ్రేడ్ చేయాలన్నారు. క్యాజువాలిటీ వార్డు రెగ్యులర్‌గా 24 గంటలు ఉండాలన్నారు. కాన్సర్ హాస్పిటల్‌లో రేడియోథెరపీ మెషిన్ ఇమ్మీడియేట్‌గా రెన్యువల్ చెయ్యాలన్నారు. బిగ్గర్ ఎండ్‌ను ఏర్పాటు చేసి కాన్సర్ పేషెంట్‌కు వైద్యం చేయాలన్నారు. ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 20 డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి. సర్వజన ఆసుపత్రిలో బెడ్లను 1000కు పెంచాలి. సత్యసాయి జిల్లా పెనుకొండలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిని పూర్తి చేయాలి. అర్బన్ సెంటర్ల దారి చూపించే సూచన బోర్డులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాసుపత్రుల్లో బ్లడ్ బ్యాంకులను 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

పశుగ్రాసం సాగును సద్వినియోగం చేసుకోండి

యల్లనూరు : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పాడి పశు రైతులకు పశుగ్రాస సాగును సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి సువర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాడి పశు రైతులకు ప్రభుత్వం మంచి సువర్ణావకాశం కల్పించిందన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఉపాధి జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, పొలం 1బి నకలు జత చేసి సంబంధిత సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల దివంగత కరస్పాండెంట్ వీకే.సుధీర్‌రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల, సక్షం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కడపకు చెందిన పుష్పగిరి కంటి వైద్యశాల వైద్య నిపుణులచే దాదాపు 300 మంది బాధితులకు పరీక్షలు నిర్వహించారు. వందమందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి వారికి ఉచితంగా కడపులోని పుష్పగిరి కంటి వైద్యశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించారు. కంటి వైద్య నిపుణులు పలువురికి కంటి అద్దాలను సూచించారు.కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, సక్షం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమైక్య భవన నిర్మాణం పనుల పరిశీలన

పామిడి : మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న విశాల పెర్రర్ వికలాంగుల మండల సమైక్య భవనం పనులను ఆర్‌డిటి బుక్కరాయసముద్రం రీజియన్ డైరెక్టర్ రఫిక్, ఎన్‌టిఎల్ క్రిష్టయ్య సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు ఏలూరు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ సర్వేష్, జాయింట్ సెక్రటరీ నాగభూషణం, మాతాశు శివన్న, బందే, వంకరాజుకాలువ కేశవ, శాషు, నల్లబోతుల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సమైక్య భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిటి సిబ్బంది